


# ఎలక్షన్లో- పెళ్ళిసందడి

- దానం ఉమాదేవి

కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ

"వారం రోజుల్లో పెండ్లి చెయ్యటానికి ఒప్పుకొన్నావు. అంత తక్కువ వ్యవధిలో ఎలా చేయగల్గుతాం? నన్ను మాట్లాడనీయకుండా వాళ్ళకు ఓ.కె. చెప్పావు".

తల్లి మీద విరుచుకుపడ్డాడు పరశురాం.

"ఎందుకురా అంత కోపం. సలక్షణమైన సంబంధం. గవర్నమెంట్ ఉద్యోగం. పిల్లగాడు బాగున్నాడు. కట్నం అడగలేదు. వాళ్ళడిగినట్లు వారంలో చేయటానికి ఒప్పుకోకపోతే మన సంబంధం మానుకుంటారేమోనని ఒప్పుకున్నాను. వారంలో పెండ్లి చేయటానికి సిద్ధం కావటం కష్టమే అయినా తప్పదురా అబ్బాయ్! సంబంధం వదులుకోవటం నాకు ఇష్టం లేదు మరి."

కొడుకుతో చెప్పింది సీతామహాలక్ష్మి.

'పెండ్లంటే మాటలా! లక్షల్లో పని! వారం రోజుల్లో డబ్బు ఎలా సమకూర్చుకోవాలి. రావల్సినవి రావటానికి పదిహేను రోజులైనా పడుతుంది..."

పరశురాంను మధ్యలోనే ఆపింది సీతామహాలక్ష్మి.

"అన్నీ భగవంతుడే చూసుకుంటాడు. ఎక్కడైనా అప్పుతే! తరువాత తీర్చొచ్చు. కక్కొచ్చినా, కళ్యాణమొచ్చినా ఆగదు..."

కొడుక్కు భరోసా ఇచ్చింది.

పరశురాం ఏకైక కూతురు శ్రీజ. యమ్.బి.ఏ. చదివింది. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో జె.ఈ.గా పనిచేస్తున్న నితీష్ కట్నం లేకుండా చేసుకుంటానన్నాడు. అమెరికా నుండి వచ్చిన నితీష్ అక్కడ వారం తరువాత స్టేట్స్ తిరిగి వెళుతుంది. ఈలోపున పెండ్లి చెయ్యమని పట్టుపట్టారు. కాదంటే వేరే సంబంధం చూసుకుంటారేమోనని వెంటనే సరేనన్నది సీతామహాలక్ష్మి.

వెంటనే సెలవుపెట్టి పెండ్లి పనుల్లో నిమగ్నమయ్యాడు పరశురాం. ఆయనకు శ్రీజ, కైలాస్ ఇద్దరు పిల్లలు. కైలాస్ ఎమ్.సి.ఎ. చదువుతున్నాడు. ఇంటికి సున్నం వేయించారు. దూరం ప్రాంతాలలో ఉన్న బంధువులందరికీ ఫోన్ల ద్వారా పెండ్లికి ఆహ్వానించాడు. శుభలేఖలు సమయానికి చేరినా చేరకపోయినా తప్పకుండా పెండ్లికి రావాలని చెప్పాడు.

ఫంక్షన్ హాల్ మాత్రం దొరకలేదు. టౌన్‌లోని కళ్యాణ మండపాలన్నీ నెలముందే బుక్ అయిపోయాయి. పెండ్లిండ్ల సీజన్ మరి.

"డబ్బుంటే వడ్డీకి తెచ్చాను. వెంటనే తీర్చవచ్చనే ధైర్యం ఉంది కాబట్టి. ఫంక్షన్ హాల్ లేకుండా పెండ్లెలా చెయ్యాలి. నీ తొందరపాటు నిర్ణయంవల్ల ఎన్ని ఇబ్బందులో చూడు."

తల్లితో విసుగ్గా అన్నాడు పరశురాం.

సంబంధం చేజారిపోతుందని సరే అన్నది కానీ సీతామహాలక్ష్మికి మనసులో భయంగానే ఉంది. అంత తక్కువ వ్యవధిలో ఎలా చెయ్యాలా అని.

ఎక్కడ పెండ్లి చెయ్యాలా అని ఆలోచిస్తున్న సీతామాలక్ష్మి చూపు ఇంటికెదురుగా ఉన్న ఖాళీ జాగామీద పడింది. దాదాపు పది సెంట్ల దాకా ఉంటుందా స్థలం. త్వరలోనే అక్కడో అపార్ట్‌మెంట్ కట్టబోతున్నట్లు చెప్పాడు ఆ స్థల యజమాని.

"హాయిగా ఆ ఖాళీ జాగాలో పెండ్లి చేయవచ్చు."

సంతోషంగా కొడుకుతో చెప్పింది. పరశురాం ఆ స్థలం వైపు చూశాడు. పిచ్చి కంప చెట్లతో నిండిపోయి ఉంది.

"ఆ స్థలం బాగుచేయటమంటే మాటలా? అసలే ఎలక్షన్ సీజన్. పనివాళ్ళు దొరకటంలేదు. శ్రీజ పెండ్లైన మరునాడే ఎలక్షన్లు. కూలీలందరూ పనిమానేసి రాజకీయ నాయకుల ప్రచారంలో పాల్గొంటున్నారు. వాళ్ళకు తిండి పెట్టి రోజుకు రెండొందలిస్తున్నారు."

తల పట్టుకున్నాడు పరశురాం.

స్థల యజమాని తెలిసినవాడు కావటంతో సీతామహాలక్ష్మి అతని అనుమతి అడిగింది. అందుకాయన సంతోషంగా ఒప్పుకున్నాడు. కారణం త్వరలోనే అతడు అక్కడ అపార్ట్‌మెంట్ కట్టబోతున్నాడు. ఆ చెట్లన్నీ కొట్టించాలంటే చాలా అవుతుంది. అతనికి ఆ ఖర్చు తప్పుతుంది మరి.

"కూలీలేమైనా దొరుకుతారేమో చూస్తాను. దొరకకపోతే తలాఒక గొడ్డలి తీసుకొని మనమే రంగంలోకి దిగాలి" అంటూ బైటికెళ్ళాడు పరశురాం.

'"చేతులు బొబ్బలెక్కటం తప్ప పది చెట్లయినా కొట్టగలమా మనం" భర్త వెళ్ళిన వైపే చూస్తూ చెప్పింది అమల.

"బామ్మా! వాళ్ళు చెప్పిన గడువులో పెండ్లి చెయ్యలేమని చెప్పండి. లేనిపోని టెన్షనెందుకు? పెండ్లి సంతోషంగా చెయ్యాలి కానీ టెన్షన్‌తో కాదు."

అన్నీ వింటున్న శ్రీజ సలహా ఇచ్చింది.

సీతామహాలక్ష్మి ఏదో అనబోయేంతలో ఒక గుంపు బయటి గేటు తోసుకొని లోపలకు వచ్చింది.

ఎన్నికల ప్రచారంకోసం వచ్చిన గుంపు అది. ఇంటి బయట మరి కొంతమంది ఉన్నారు.

"నమస్కారమమ్మా. మీ ఓటు మాకే వెయ్యాలి." అంటూ రెండు చేతులూ జోడించాడు ఆ పార్టీ అభ్యర్థి.

సీతామహాలక్ష్మి మైండ్‌లో ఫ్లాష్‌లా ఓ ఆలోచన.

"మా మరుదులు- తోడికోడళ్ళు వాళ్ళ పిల్లలు, నా కొడుకులు- కోడళ్ళు- కూతుళ్ళు- అల్లుళ్ల మనవలు- మనవరాండ్రు అందరికీ ఇక్కడే ఓట్లున్నాయి. ఉద్యోగరీత్యా వాళ్ళు వేరే ఊర్లకి ట్రాన్సఫరై వెళ్ళిపోయినా ఓట్లు ఇక్కడే ఉన్నాయి. ఎలక్షన్ ముందురోజు మా మనవరాలి పెండ్లి. పెండ్లి కొచ్చి ఓటేసి వెళతారు. దాదాపు యాభై అరవై ఓట్లుంటాయి. కానీ ఆ ఎదురు జాగా ఈ కొద్ది సమయంలో శుభ్రం చేయటం కష్టమేమోనని పెండ్లి వాయిదా వేద్దామనుకుంటున్నాం. వాయిదా పడితే మా వాళ్ళందరూ రాకపోవచ్చు."

తనకు పడే యాభై ఓట్లు పడకుండా పోతాయన్న మాట అనుకున్నాడా అభ్యర్థి సీతామహాలక్ష్మి చెప్పింది వినగానే.

యాభై ఓట్లంటే మాటలా ఈ బామ్మగారిని కాకాపట్టి మొత్తం ఓట్లన్నీ తనే వేయించుకోవాలి.

"ఆ స్థలం బాగుచేయటం ఎంతసేపు బామ్మగారు! రేయ్ వీరయ్యా, వెంకన్నా మీరు ఓ పదిహేను- ఇరవై మంది ఇక్కడ ఉండి ఆ చెట్లు నరికి ఆ స్థలం శుభ్రం చేసి రండి" అంటూ అనుచరులకు ఆర్డరేసి సీతామహాలక్ష్మి దగ్గరికి వచ్చాడా అభ్యర్థి.

"బామ్మగారూ! పెద్దవాళ్ళు. నేను గెలవాలని ఆశీర్వదించి మీ ఓట్లన్ని నాకే వెయ్యండి" అంటూ ఆమె కాళ్ళకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకొని వెళ్ళిపోయాడా అభ్యర్థి.

ఇరుగు-పొరుగు ఇళ్ళనుండి కొన్ని గొడ్డళ్ళు సేకరించి ఆ వ్యక్తులకిచ్చింది సీతామహాలక్ష్మి. ఆ అభ్యర్థి అనుచరులు రంగంలోకి దిగారు. కొంతమంది చెట్లు నేలకూలుస్తుంటే కొంతమంది వెంటనే వాటిని అక్కడనుండి తొలగించి పక్కన పడేస్తున్నారు. ఏకబిగిన రెండు గంటలసేపు సాగిందా తతంగం.

"అంతా శుభ్రంచేశాం బామ్మగారూ? మీ ఓట్లు మా నాయకుడికే వేయండి" అంటూ వెళ్ళిపోయారా వ్యక్తులు.

"బామ్మా! ఏం బుర్రే నీది" అన్నాడు కైలాస్ నవ్వుతూ.

"నువ్వు ఎలక్షన్లలో నిలబడ్డా గెలిచేటట్లున్నావు" బామ్మను చూస్తూ వేళాకోళమాడింది శ్రీజ.

"అతికష్టమ్మీద ఇద్దరు కూలీలు దొరికారు. వాళ్ళు రేపు ఉదయం నుండి పని మొదలు పెడతామన్నారు."

అప్పుడే లోపలకు వచ్చిన పరశురాం కుర్చీలో కూర్చుంటూ చెప్పాడు.

"ఆ ఇద్దరూ రేపొచ్చి ఏంచేస్తారు? అక్కడ ఈడ్చి ముగ్గేస్తారా" అన్నాడు కైలాస్ పగలబడి నవ్వుతూ.

ఆ నవ్వు చూస్తుంటే వళ్ళు మండిపోయింది పరశురాంకు.

"బాధ్యత నెత్తినేసుకొని పనులు చేయించేవాడికి ఉంటుంది టెన్షన్. మీకేం హాయిగా ఇంట్లో కూర్చుని నవ్వండి. ఏదైనా ఒక పని సక్రమంగా చెయ్యి. తెలుస్తుంది కష్టం."

కొడుకు మీద విరుచుకుపడ్డాడు.

"ఒకసారి ఇంటి ముందు వైపు చూసి తరువాత మాట్లాడండి" అన్నది అమల.

అటు చూసిన పరశురాం నోరెల్లబెట్టాడు. తాను బయటికి వెళ్ళేటప్పుడు అంతా చెట్లతో గజిబిజిగా ఉంది. ఇప్పుడు నీట్‌గా ఉంది. ఇదెలా సాధ్యం. కళ్ళు నులుముకుని మరీ చూశాడు. చూస్తున్నది నిజమే.

"ఇదెలా సాధ్యం" ఆశ్చర్యంగా అడిగాడు పరశురాం.

"బామ్మ మంత్రం పెట్టింది" అన్నాడు కైలాస్ నవ్వుతూ.

"టెన్షన్ భరించలేకపోతున్నా ఏం జరిగిందో చెప్పండి".



ఇరుగు-పొరుగు ఇళ్ళనుండి కొన్ని గొడ్డళ్ళు సేకరించి ఆ వ్యక్తులకిచ్చింది సీతామహాలక్ష్మి. ఆ అభ్యర్థి అనుచరులు రంగంలోకి దిగారు. కొంతమంది చెట్లు నేల కూలుస్తుంటే కొంతమంది వెంటనే వాటిని అక్కడనుండి తొలగించి పక్కన పడేస్తున్నారు. ఏకబిగిన రెండు గంటలసేపు సాగిందా తతంగం.

అమల జరిగిందంతా చెప్పింది.

"నువ్వు చెప్పింది అబద్ధమని చెబితే ఏం జరుగుతుందో" తల్లిని చూస్తూ చెప్పాడు పరశురాం.

"అంతకుమించి నాకు మార్గం దొరకలేదురా అబ్బాయ్! స్థలం గురించి టెన్షన్ తీరిపోయింది. వాళ్ళకేం తెలుసు మనవాళ్ళు ఉన్నారో లేదో? నేను మేసేజ్ చేస్తా గదా."

భరోసా ఇచ్చింది సీతామహాలక్ష్మి.

తల్లి ధైర్యానికి విస్తుపోయాడు పరశురాం.

❋ ❋ ❋

"సుబ్బులూ, ఎండు మిరపకాయలు తొడిమలు తీసిపో."

పని పూర్తిచేసుకొని వెళుతున్న పనిమనిషితో చెప్పింది అమల.

"టైం లేదమ్మగోరు! పార్టీ ప్రచారానికి తిరగాలి. లేత్తైతే మేస్త్రమ్మ సగం డబ్బులే ఇస్తుంది. ఎలచ్చన్లు అయ్యేదాకా పని మానేద్దామనుకున్నాగానీ, అమ్మాయి గారి పెండ్లని మానుకోలేదు. రోజుకు రెండొందలిస్తారట పార్టీలవాళ్ళు. ఇప్పుడేగా మాకు కూడా నాలుగు డబ్బులొచ్చేది" అంటూ హడావుడిగా వెళ్ళిపోయింది సుబ్బులు.

"ఎలక్షన్ల టైంలో పెండ్లి పెట్టుకున్నాం. కూలి మనుషులు దొరకరు. పెండ్లి అయ్యేదాకా టెన్షనే."

అందుకున్నాడు పరశురాం.

"ఆ మిరపకాయల పని నేను చూసుకుంటా గానీ ఈ రోజు మీరు పెండ్లి బట్టలకు వెళ్ళాలన్నారు గదా? ఆ పని చూసుకోండి".

మిరపకాయల బస్తా దగ్గరకు లాక్కుని కొన్ని మిరపకాయలు క్రిందపోసి తొడిమలు తియ్యటం మొదలుపెట్టింది సీతామహాలక్ష్మి.

ఏవో తత్వాలు పాడుకుంటూ తొడిమలు తీస్తున్నది ఆమె 'నమస్కారం బామ్మగారూ' అన్నమాటలకు తలెత్తి చూసింది.

ఎదురుగా ఓ పాతిక మంది ఆడంగులు.

"నేను సుబ్బన్నగారి భార్యనండి. మీ ఓటు మా ఆయనకే వెయ్యాలమ్మా" అంటూ మిరపకాయలు తొడిమలు తీయటం మొదలుపెట్టిందో పట్టుచీర శాల్తీ. అవతలవాళ్ళు చేస్తున్న పనిలో పాలుపంచుకుంటూ ఓట్లడిగితే ఆ మహిళలు తప్పకుండా తమకే ఓట్లేస్తారన్నది సదరు శాల్తీ ఫిలాసఫీ.

"మా యింట్లో మొత్తం పన్నెండు ఓట్లున్నాయి" అంటూ మిరపకాయ బస్తాలోని మిరపకాయలన్నీ వాళ్ళముందు కుమ్మరించింది సీతామహాలక్ష్మి.

తమ నాయకుడి భార్య తొడిమలు తీస్తుండటంతో తలా ఒక చేయి వేశారు ఆమెతో వచ్చిన మిగతా ఆడంగులు. వాళ్ళు వెంటనే లేచి ప్రచారానికి వెళ్ళకుండా వాళ్ళని తన మాటలతో కట్టిపడేసింది సీతామహాలక్ష్మి.

బస్తా మిరపకాయలు తొడిమలు తీయటం అరగంట పట్టలేదు.

"బామ్మగారూ! మీ ఓట్లు మావారికే వెయ్యాలి" చేతులు జోడించి మరోసారి అభ్యర్థించింది సదరు అభ్యర్థి భార్య.

"తప్పకుండా" అంటూ వాళ్ళను వాకిలి దాకా సాగనంపింది.


"యాభై మంది ఓటర్లు కాస్తా పన్నెండు మందికి ఎట్లా పడిపోయారే బామ్మా? ఎవర్ని పైకి లేపేశావ్."


వస్తున్న నవ్వాపుకుంటూ అడిగాడు కైలాస్.

"అందరి దగ్గరా ఒకేలా చెబితే ఎలా" అంటూ బస్తా గోడకు ఆనించింది సీతామహాలక్ష్మి.

ఎలక్షన్ల సీజన్ అవటంతో కార్లు, ప్రైవేట్ బస్‌ల అద్దెలు విపరీతంగా పెరిగిపోయాయి. స్థానికంగా ఉండని ఓటర్లను కార్లు, బస్‌లు పెట్టి రప్పించే ప్రయత్నం చేస్తున్నారు ఆయా పార్టీల వాళ్ళు.

(మిగతా 27వ పేజీలో)



(19వ పేజీ తరువాయి)

"పెండ్లివాళ్ళు తరలి వచ్చే బస్ ఛార్జీలు అదిరిపోయేలా ఉన్నాయి అమ్మా. కట్నం లేదు కాబట్టి రాను-పోను బస్ మనల్నే మాట్లాడమన్నారు. ప్రతి దానికీ కట్నం తీసుకోవటం లేదు కాబట్టి అన్ని ఖర్చులూ మీరే పెట్టుకోండి అంటున్నారు. వీడియో ఫొటోస్, మేళం సమస్తం మనమేనట. ఇందాకనే వియ్యంకుడు ఫోన్ చేశాడు."

బట్టల మూట లోపల పెట్టటానికి ఆటో వాడికి సాయం చేస్తూ తల్లితో చెప్పాడు పరశురాం.

"ఆ మాత్రం దానికి కట్నమే తీసుకోవచ్చుగా" విసుగ్గా అన్నది అమల.

"కట్నం లేదుకదా అని వెంటనే ఒప్పుకున్నావు. ఎలక్షన్ల సీజన్లో వారంలో పెండ్లంటే ఎన్ని ఇబ్బందులు- ఎంత అదనపు ఖర్చుల్లో చూడు" నిష్టూరంగా తల్లితో అన్నాడు పరశురాం.

"డాడీ! ఎలక్షన్ సీజన్ అన్న సంగతి బామ్మకు బాగా తెలుసు."

'బాగా' అన్న పదాన్ని వత్తి పలుకుతూ నవ్వుతూ తండ్రితో అన్నాడు కైలాస్.

బామ్మ ఎలా ప్రచారానికి వచ్చిన వాళ్ళచేత మిరప కాయలు తీయించిందో శ్రీజ చెప్పింది.

"అమ్మా! నా తిప్పలు నేను పడతాను గానీ ఇలాంటి ట్రిక్కులు ప్రయోగించమాకు. తరువాత నిజం తెలిస్తే ఇబ్బంది పడాలి."

తల్లిని హెచ్చరించాడు పరశురాం.

* * *

"అమ్మా! అక్కా! మీ ఓటు నాకే వెయ్యాలి."

వరండా ముందు మంచమ్మీద వడియాలు పెడుతున్న అత్తా-కోడళ్ళకు నమస్కారం చేస్తూ ఓటు అడిగాడో అభ్యర్థి.

తలెత్తి అతన్ని తేరిపారచూసింది సీతామహాలక్ష్మి.

"ఈ ఊరు కాదా" అనుమానంగా అడిగింది.

"పక్క ఊరండి. ఈ నియోజకవర్గం టికెట్ నాకిచ్చారు. నన్ను గెలిపించాలి."

"మేం మొదటినుండి మా పార్టీనేనయ్యా. తెలిసిన వాళ్ళకు కూడా మీ పార్టీకే ఓటెయ్యమని చెబుతుంటాను. ఇక్కడ ఓటున్న మావాళ్ళు చాలామంది వేరే ఊర్లో ఉన్నారు.

ఎలక్షన్ల ముందురోజు మా మనవరాలి పెండ్లి. ప్రైవేట్ బస్‌లు దొరక్క, దొరికినా అద్దె ఎక్కువ ఉండటంతో వాళ్ళకోసం బస్ పంపించటం లేదు. బస్ పంపిస్తేనే పెండ్లి కొస్తామని పేచీ. పెండ్లికొస్తే ఎలాగూ ఓటేసే వెళతారనుకో..." అంటూ ఆగింది సీతామహాలక్ష్మి.

"వాళ్ళందరూ ఎక్కడినుండి రావాలండీ" ఆశగా అడిగాడా అభ్యర్థి.

"గుంటూరు నుండి."

"గుంటూరులో మా వాళ్ళదే 'జగదంబ బస్ సర్వీస్' ఉన్నది. ఒక ఛార్జి నేను పెట్టుకుంటాను రాను పోను ఛార్జీల్లో ఒకటి మీరు పెట్టుకోండి. మీకూ కలిసి వస్తుంది. నాకూ కలిసి వస్తుంది."

అంటూ సీతామహాలక్ష్మి అంగీకారంతో పనిలేకుండా సెల్‌నుండి ఎవరికో ఫోన్ చేసి ఏదో మాట్లాడాడు.

"బామ్మగారూ మావాడికి అంతా చెప్పాను. వాడి నెంబరిదిగో. బస్ ఎప్పుడు కావాలో వాడికి చెప్పండి. ఒక్క ఛార్జి ఇవ్వండి చాలు. ఓటు మాత్రం నాకేయ్యటం మర్చిపోవద్దు."

మరోసారి అందరికి నమస్కారం చేసి వెళ్ళిపోయాడా అభ్యర్థి.

"ఆయన వస్తే అరుస్తారేమో అత్తయ్యగారూ" అన్నది అమల.

"ఎందుకు అరుస్తాడు. వాళ్ళంతట వాళ్ళే బస్ అరేంజ్ చేశారు. నేనడిగానా ఏమిటి?"

"సామాన్యంగా రాజకీయ నాయకులు ఓటర్లను ప్రలోభపెడుతుంటారు. నువ్వు అందుకు పూర్తిగా రివర్సే బామ్మా! ఎలక్షన్లలో నిలబడు. గెలుపు తథ్యం. నిన్ను సి.యమ్‌ను చేసినా ఆశ్చర్యం లేదు."

సీతామహాలక్ష్మిని గట్టిగా ముద్దు పెట్టుకుంటూ చెప్పింది శ్రీజ.

బస్ సమస్య తీరిపోయిందని కైలాస్ ఫోన్‌చేసి చెప్పడంతో వెంటనే ఇంటికి వచ్చాడు పరశురాం.

శ్రీజ జరిగింది చెప్పింది.

"వాళ్ళకు నిజం తెలుస్తుందేమోనన్న భయం వద్దు. నేను చూసుకుంటాగా. నా మనుమరాలి పెండ్లి ముఖ్యం నాకు."

కొడుక్కు అభయం ఇచ్చింది సీతామహాలక్ష్మి.

ఆమె సామర్థ్యం మీద, లౌక్యం మీద నమ్మకం కుదిరింది పరశురాంకు.

"నీ ఇష్టమమ్మా?" అన్నాడు.



ఎలక్షన్ల ముందు రోజు మా మనవరాలి పెండ్లి. ప్రైవేట్ బస్‌లు దొరక్క, దొరికినా అద్దె ఎక్కువ ఉండటంతో వాళ్ళకోసం బస్ పంపించటం లేదు. బస్ పంపిస్తేనే పెండ్లి కొస్తామని పేచీ. పెండ్లికొస్తే ఎలాగూ ఓటేసే వెళతారనుకో...

* * *

పెండ్లి రోజు రానే వచ్చింది. ఇంటి ముందు జాగా అంతా నీళ్ళు చల్లి వేదిక ఏర్పాటుచేశారు. టెంట్, లైటింగ్ అన్నీ సమకూర్చారు. మగ పెండ్లివాళ్ళు ఒక బస్, రెండు సుమోలలో వచ్చారు. పరశురాం బంధువులూ బాగానే వచ్చారు. రాత్రి ఏడు గంటలకు కళ్యాణం. పరశురాం ఎవరికీ ఎక్కడా ఏ లోపమూ జరగనివ్వలేదు. పెండ్లి బ్రహ్మాండంగా జరిపించాడు. మగ పెండ్లివాళ్ళు మరుసటిరోజు మధ్యాహ్నం భోజనాలు చేసుకొని తిరుగు ప్రయాణమవుతామని చెప్పారు.

తెల్లవారింది. ఆరోజే ఎలక్షన్లు.

"ఓట్లేసి వద్దాం పదండి" మరుసటిరోజు ఉదయం ఫలహారాలు- కాఫీలు అయ్యాక కొడుకు- కోడలుతో చెప్పింది సీతామహాలక్ష్మి.

"ఇంటినిండా ఇంతమంది బంధువులను ఉంచుకొని ఓట్లెయ్యటానికి వెళ్ళకపోతే ఏం పిన్నీ." అడిగిందో నడి వయస్కురాలు.

"ఓటు హక్కు ఉన్నప్పుడు ఉపయోగించుకోవాలి. అంతేగాని బద్ధకించగూడదు. కొద్దోగొప్పో చదువుకున్న దానివి ఆమాత్రం తెలీదా."

"మామ్మగారూ మిమ్మల్ని చూసి చాలా నేర్చుకోవాలండీ. స్కూటర్ మీద వెళ్ళి ఓటేసి రావటానికి కూడా బద్ధకిస్తున్నారు. ఈ కాలం పిల్లలు నేటి యువతలో రాజకీయ చైతన్యం రావాలంటే మీలాంటి వాళ్ళు ఉండాలి" అభినందించాడో బంధువు.

కొడుకు- కోడలుతో కలిసి పోలింగ్ బూత్‌కు బయలుదేరింది సీతామహాలక్ష్మి.

"కాస్త గుంపుగా ఉన్న జనంతో కలిసి నడవండి. పక్కనున్న వాళ్ళు తెలియకపోయినా పరిచయస్థుల్లా నవ్వుతూ ఏదో ఒకటి మాట్లాడండి. ఏ పార్టీ వాళ్ళైనా చూసినా ఆ గుంపు మన జనమే అనుకోవాలి."

కొడుకు- కోడలుకు జ్ఞాన బోధ చేసి అక్కడున్న గుంపులో జొరబడింది.

"నీ పేరు సుభద్ర కదూ" అన్నది ఒకామె మీద చెయ్యేస్తూ.

"కాదండి సత్యవతి."

"మా మనవరాలున్నట్లే ఉన్నది" అంటూ ఒకరి చేతిలోని పాపను ముద్దాడింది. "శారీవర్క్ బాగుంది నువ్వే చేశావా" అంటూ మరొకామెతో మాట కలిపింది.

"ఎండలు మండిపోతున్నాయి" అంటూ సమవయస్కురాలితో కబుర్లలో పడింది సీతామహాలక్ష్మి.

దూరంగా శిబిరాలు వేసుకున్న పార్టీల కార్యకర్తలు సీతామహాలక్ష్మిని చూసి చేతులూపారు. గమనించినట్లే నటిస్తూ ముందుకు వెళ్ళింది. ఓట్లేసి అందరూ తిరిగి ఇళ్ళకు చేరుకున్నారు. మగ పెండ్లివాళ్ళు భోజనాలు చేసి శ్రీజను తీసుకొని వెళ్ళిపోయారు. మిగతా బంధువులు కూడా చాలామంది వెళ్ళిపోయారు.

"ఎలక్షన్ల సీజన్లో వారం రోజుల్లో పెండ్లి చేయటం గ్రేట్ అన్నయ్యా." పరశురాంతో చెప్పింది చెల్లెలు సావిత్రి.

"ఎలక్షన్ సీజన్ కాబట్టే వారంలో పెండ్లి చేయగల్గాం అత్తా" అన్నాడు కైలాస్ నవ్వుతూ. కైలాస్ చెప్పింది వింటున్నకొద్దీ ఆమెకు నవ్వాగటం లేదు.

"మొత్తానికి రాజనీతి' ఉపయోగించానన్నమాట" అన్నది తల్లిని చూసి నవ్వుతూ సావిత్రి.

★

రచయిత్రి చిరునామా:
దానం ఉమాదేవి
వైఫాఫ్ దానం శివప్రసాదరావు
ఇం.నెం.15-2-132/1,
గాయత్రీనగర్, ఫస్ట్ క్రాస్‌రోడ్,
మాచర్ల- 522 426,
గుంటూరు జిల్లా.